
www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 9 ఆగస్టు 2023

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలు

యువతకు ఆదర్శం కావాలి : మేయర్



ప్రజాశక్తి-నెల్లూరు: భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొని అమరులైన వారి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశభక్తిని పెంపొందించుకోవాలని నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ స్రవంతిజయవర్ధన్ తెలిపారు. మంగళవారం స్థానిక జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నందు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల ఫోటో గ్యాలరీని మేయర్ సందర్శించారు. ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అమరులైన వారి జీవిత చరిత్రలను భావితరాలకు తెలియజేయడానికి ఆవాజ్ ఇటువంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజలను చైతన్యవంతులుగా చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను మేయర్ అభినందించారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు రఫీ, కార్యదర్శి రషీద్ ఉన్నారు.

కోర్టు.. గీటు.. జాంతానై..!

నెల్లూరు నగరంలో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణ చేసి నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రెవెన్యూలో ఏ రికార్డులు ఎలా ఉన్నా రియల్ ఎస్టేట్ ఫైల్స్ మాత్రం చక చక కదిలిపోతున్నాయి. అధికారపార్టీ నేతల అండదండలతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్నారు. అధికారపార్టీ నేతలకు భయపడి కొందరు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పావులుపోతున్నారు.హైకోర్టు, కలెక్టర్ ఉత్తర్వులను పక్కన పెట్టి చోద్యం చూస్తున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ప్లాట్స్ తయారు చేస్తున్నారు. అల్లీపురం గ్రామంలో ఇరిగేషన్‌కు చెందిన 6.30 ఎకరాలు ఆక్రమించి, ప్లాట్స్‌గా మార్చేసిన విషయం తెలిసిందే. అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు చర్యలు తీసుకోవాలని, రిజిస్ట్రేషన్లు ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత కలెక్టర్ ఎం. హరినారాయణన్ ఈ విషయంపై సీరియస్ అయ్యారు. వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిని అమలు చేయాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సిబ్బంది లేరంటూ తప్పించుకుంటున్నారు. అదిగో, ఇదిగో అంటూ కాలం గడుపుతున్నారు..అల్లీపురం ప్రాంతవాసులు కంటెంట్ ఆఫ్ కోర్టుకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

- అల్లీపురంలో అంతా మాయ
- కోర్టు, కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- నేతల బెదిరింపులతో అధికారులు బెంబేలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు నుడా పరిధిలోనూ పెద్ద ఎత్తున అక్రమ లేవుట్లు సాగుతున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతోంది. నుడా పరిధిలో 118 అక్రమ లేవుట్లు ఉన్నట్లు ఆశాఖ అధికారులు ఎప్పుడో గుర్తించారు. కార్పొరేషన్, నుడా, అనుమతులు లేకుండా, ఒక వేళ ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా ఇవి సాగుతున్నాయి. 40 అడుగులు ఉండాల్సిన రోడ్లు 30 నుంచి 20 అడుగులకు కుదించారు. సామాజిక అవసరాలు ఉండాల్సిన భూమిని కొందరు వదలడం లేదు. ఇవి అక్రమ లేవుట్లు అని తెలిసినా రిజిస్ట్రేషన్లు ఆగడం లేదు. వీటిని నిలుపుదల చేయడానికి ఎలాంటి చట్టాలూ లేవని తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలు సాగిపోతున్నాయి. మధ్య తరగతి ప్రజలు సొంతింటి కల కోసం అప్పులు చేసి భూములు కొనుగోలు చేస్తున్నారు. జరుగుతోన్న పరిణామాలు వారిని ఆందోళన కలిగిస్తున్నాయి. అల్లీపురం గ్రామంలో ఏకంగా ప్రభుత్వ భూమినే ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారు. గతంలో ఈ విషయం కలెక్టర్ చక్రధర్ బాబు దృష్టికెళ్లింది. ఆయన విచారణ జరిపించారు. ఈ క్రమంలో మొత్తం లేవుట్‌లో 6.30 ఎకరాలు ఇరిగేషన్ భూములను ప్లాట్స్‌గా మార్చేశారని నివేదిక ఇచ్చారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, కార్పొరేషన్, నుడా అధికారులను, ఇరిగేషన్ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అధికారపార్టీ నేత ఒకరు బెదిరింపులకు భయండినట్లు ప్రచారం సాగుతోంది. ఇరిగేషన్ కాలువలను పూడ్చేసి, ప్లాట్స్ చేశారని ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలకు ముందుకు వెళ్లడం లేదు. తమకు ఒక్క ఏఈ మాత్రమే ఉన్నారని, అక్కడకు వెళితే తమను బెదిరిస్తున్నారని, తమకు ఎవరు రక్షణ ఇస్తారంటూ ఇరిగేషన్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. హైకోర్టు కూడా ఇరిగేషన్ భూములు స్వాధీనం చేసుకోవాలని, అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేసింది. సుమారు మూడు నెలల క్రితం కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటి వరకు సర్వేల పేరుతో కాలం గడుపుతున్నారు. మరో వైపు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు అమలు జరగడం లేదు. హైకోర్టు లేదు. కలెక్టర్ లేదంటూ రెచ్చిపోతున్నారు. తమకు నేతల అండదండలు న్నాయని చెలరేగిపోతున్నారు. అల్లీపురంలో ఇరిగేషన్ వివాదస్పద స్థలాల్లో యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయి. ఏ ఒక్క అధికారి నిలుపుదల చేయడానికి ముందుకు వెళ్లడం లేదు. కొందరు తామూ అక్కడకు వెళ్లాలంటే భయమేస్తుందంటూ చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది.



అల్లీపురంలో అక్రమం నిర్మాణం చేసి, రోడ్లు, ఇళ్లు ఉన్న దృశ్యం

కోర్టు, కలెక్టర్ లెక్కలేదా..!

అల్లీపురంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. సర్వేనెంబర్ 255,88-3, 88-2 ఈ1, 88-1,తోపాటు కోడూరు కాలువ, బురద కాలువ, పల్లపు కాలువ వెళుతున్నాయి. ఈ కాలువలు ఆక్రమించి రోడ్లు, నిర్మాణాలు చేపట్టారు. కళ్ల ముందు కనిపిస్తున్నా ఇరిగేషన్ అధికారులు గంతలు కట్టుకున్నారు. మా కెందుకులే అని పట్టించుకోవడం లేదు. కలెక్టర్ రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు నోటీసులు జారీ చేశారు. సర్వే చేస్తున్నామంటూ దాట వేస్తున్నారు. మరో వైపు అధికారపార్టీ నేతల అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ పని తాను చేసుకుపోతున్నారు. హైకోర్టు ఇచ్చిన గడువు ముగిసినట్లు తెలుస్తోంది. అల్లీపురం రైతులు హైకోర్టును మళ్లీ ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. కోర్టు ఉత్తర్వులు అమలు చేయలేదని చర్యలు తీసుకోవాలని కోర్టును కోరనున్నట్లు తెలుస్తోంది. హైకోర్టు, కలెక్టర్ ఆదేశాలకన్నా అధికారపార్టీ నేతల ఫోన్ కాల్స్‌కు అధికారులు బెంబేలెత్తి పోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. మరో వైపు నిర్మాణాలు చేసుకుంటున్న వ్యక్తులు భయపడుతున్నారు. రేపు ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన చెందుతున్నారు.



రిలే దీక్షల్లో విఆర్ఎలు

కొనసాగిన విఆర్ఎల రిలే దీక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు : గ్రామ రెవెన్యూ సహాయకులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పేస్కేలు అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రెండో రోజు కలెక్టర్ కార్యాలయం వద్ద విఆర్ఎలు రిలే దీక్షలు నిర్వహించారు. ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కె పెంచల నరసయ్య మాట్లాడుతూ గ్రామ సేవకులకు గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి విఆర్ఎలకు కనీస వేతనాలు పెంచుతామని, నామినీలుగా పనిచేస్తున్న వారసులను విఆర్ఎలుగా నియమిస్తామని, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తికావస్తున్న విఆర్ఏలకు చేసిన ఒక్క హామీకూడా అమలు చేయక పోగా గతంలో పోరాడి సాధించుకున్న డిఎను రద్దు చేశారన్నారు. తెలంగాణాలో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేలు అమలు చేస్తుంటే, ఇక్కడ మాత్రం విఆర్ఏలకు ఇచ్చినల హామీలను తుంగలో తొక్కడ దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాము. లేదంటే ఒదోళన చేస్తామని తెలిపారు. ఆర్. దుగ్గయ్య, ఎస్కే. ఫరీద్, వి. భాస్కర్, భాష, సీతమ్మ, అంకయ్య, ప్రసాద్, శీను పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లూరు :నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ మంగళవారం స్థానిక 12వ డివిజన్ సౌత్ రాజుపాళెంలో పర్యటించారు. డివిజన్‌లోని 12/2 సచివాలయ పరిధిలోని సౌత్ రాజుపాళెంలోని వీధులను మేయర్ పరిశీలించారు. స్థానిక నాయకులు, అధికారులు ఉన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-నెల్లూరు :కేంద్ర ప్రభుత్వ షరతులకు లోబడి విద్యుత్ సంస్కరణల పేరుతో కరెంటు ఛార్జీలను వైసిపి ప్రభుత్వం విపరీతంగా పెంపుదల చేయడం దారుణ మని, ఇప్పటికైనా స్పందించి పెంచిన విద్యుత్తు ఛార్జీలను తక్షణమే తగ్గించి వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక 5వ డివిజన్ పరిధిలోని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరు యాత్ర మూడవ రోజు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ బర్మాషేల్ గుంట, పాత చెక్ పోస్టు ప్రాంత ప్రజలకు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి డిమాండ్ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ బర్మా శాల గుంట పాత చెక్‌పోస్టు ఏరియాలలో రైల్వే అధికారులు ఇళ్లను తొలగిస్తామని అనేకసార్లు హెచ్చరికలు చేస్తున్నారని, గత మూడేళ్ల నుంచి వారికి ఇళ్ల నిర్మాణం చేయకుండా అధికారులు కాలయాపన చేశారన్నారు. పెన్నా నది ఒడ్డునే ఉన్న కొళాయిలలో తాగేందుకు ఉపయోగపడే విధంగా నీరు రావడంలేదని ప్రజల ఆవేదన వ్యక్తం చేశారన్నారు. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాత్ర బర్మాశాలగుంట,పాత చెక్ పోస్టు ఏరియా,అహ్మద్ నగర్, బోడిగాడి తోట,వైకుంఠపురం, సత్యనారా యణపురం ,శ్రీనివాస్ నగర్, జాకీర్ హుస్సేన్ నగర్, రాజీవ్ గాంధీ కాలనీ,కిసాన్ నగర్ ప్రాంతాలలో కొనసాగింది.సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగేశ్వరరావు, నగర కమిటీ సభ్యులు ఎం చిరంజీవి, బి రాంబాబు, బీపీ నరసింహ, కత్తి పద్మ,మూలం ప్రసాద్, చెంగయ్య, పి. వేణు శాఖా కార్యదర్శి షేక్ రవూఫ్,చంగయ్య ఆవాజ్ నగర కార్యదర్శి షేక్ రియాజ్, రవుఫ్, ప్రజానాట్య మండలి నాయకులు పెంచలయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

పారిశుధ్య నిర్వహణకు సహకరించాలి : కమిషనర్

నెల్లూరు : క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్వహణకు ప్రజలంతా బాధ్యతగా సహకరించేలా పర్యవేక్షించాలని, వీధుల్లో చెత్త కనిపిస్తే ఆ నిర్లక్ష్యానికి శానిటేషన్ సెక్రటరీలను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 35 వ డివిజను పొదలకూరు రోడ్డు, సారాయి అంగడి కూడలి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమిషనర్ మంగళవారం పర్యవేక్షించారు. పొదలకూరు రోడ్డు వీధుల్లోని లిఫ్ట్ పాయింట్ల వద్దనుంచి వాహనాల ద్వారా చెత్తను సేకరించడాన్ని గమనించిన కమిషనర్ శానిటేషన్ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ మాత్రమే జరిగేలా పర్యవేక్షించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే షో కాజ్ నోటీసులు జారీ చేస్తామని శానిటేషన్ కార్యదర్శులను హెచ్చరించారు.నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, శానిటేషన్ సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు , సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని జిల్లెలమూడి గ్రామ పంచాయతీలో 6వ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కందుకూరు సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు స్టేజ్ -1 రిటర్నింగ్ అధికారిగా మండల వ్యవసాయాధికారి వి రాముని నియమించారు. వి రాము మాట్లాడుతూ జిల్లెలమూడి పంచాయతీలోని 6వ వార్డుకు నామినేషనల స్వీకరణ ప్రక్రియ ఈనెల 8 నుంచి 10 వరకూ ఉంటుందన్నారు. పోలింగ్ ప్రక్రియ 19న ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పోలింగ్ కేంద్రాన్ని వారు పరిశీలించారు. పంచాయతీ సెక్రెటరీ యం హనుమంతరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి -గుడ్లూరు : మండలంలోని పోట్లూరులో రెండు అంగన్ కేంద్రాలను ఉలవపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని సిడిపీ విజయ్ కుమారి మంగళవారం తనిఖీ చేశారు. పోట్లూరులో రెండో అంగన్‌వాడీ కేంద్రంలో నలుగురు గర్భిణులకు పౌష్టికాహారం అందజేసేందుకు ఏర్పడిన సాంకేతిక లోపం టి హెచ్ ఆర్ కి సంబంధించి గుడ్లు, పాలు బియ్యం, రాగి పిండి, ఖర్జూరపు కిట్లు అందజేశారు. గుడ్లూరు -2 అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకి సౌకర్యంగా ఉండేందుకు వీలుగా కేంద్రాన్ని మరమ్మ తులు చేయాలని, అప్పటివరకు ప్రయివేటు భవనంలో కేంద్రాన్ని నిర్వహిం చాలని సిడిపిఒ తెలిపారు. ఎస్‌కె అమీర్ రమాదేవి, మరియమ్మ సూపర్వైజర్ కామేశ్వరి పాల్గొన్నారు.

'టిఆర్ఆర్' విద్యార్థిని ప్రతిభ

ఎంఎల్ఎ 'మానుగుంట' అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బిఎ స్పెషల్ ఇంగ్లీష్ విద్యార్థిని, ఇట్టా సింధుజ ఎన్‌సిఇఆర్‌డి నిర్వహించిన అఖిల భారత ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఇంగ్లీష్ విభాగంలో ఆల్ ఇండియా 168వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకునూ, రిజర్వేషన్ కేటగిరీలో మొదటి ర్యాంకు సాధించింది. సామాన్య గ్రామీణ ప్రాంత కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థిని అఖిల భారత స్థాయిలో ఆంగ్ల విభాగంలో ఈ విధంగా రాణించటం ఎంతో గర్వించదగ్గ విషయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవి కుమార్ తెలిపారు. టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం అఖిలభారత స్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోను పోటీ పరీక్షల్లో రాణించి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో సీట్లు సాధిస్తున్నారని తెలిపారు. సింధుజాను కళాశాల అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. కళాశాల అధ్యాపకుల బోధన, ప్రిన్సిపాల్ గైడెన్స్ , తల్లిదండ్రుల ప్రోత్సాహం వలన ఈ విజయం సాధించానని సింధుజ తెలిపారు. ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి విద్యార్థినిని అభినందిస్తూ మంచి భవిష్యత్తు కలిగి ఉండాలని ఆశీర్వదించారు.



చెక్‌పవర్ రద్దు చేయడం సరికాదు : టిడిపి

ప్రజాశక్తి-కందుకూరు :జిల్లాలోని ఆత్మకూరు మండలంలోని అప్పారావు పాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ సోము కుమారి గిరిజన మహిళ అయినందునే ప్రభుత్వ అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా చెక్ పవర్ రద్దుచేశారని నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఆరోపించారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గిరిజనులకు , మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అధికార వైసిపి నాయకులు చెప్పినట్లు ప్రభుత్వ అధికారులు నడుసుకుంటున్నారన్నారు. ఆత్మకూరు జెడ్‌పిటిసి భర్త శ్రీనివాసులు నాయుడు చెప్పినట్లు వినకపోతే ప్రభుత్వ అధికారులు చెక్ పవర్ రద్దు చేస్తారా అని మోషే ప్రశ్నించారు. సోము కుమారికి చెక్ పవర్ ను పునరుద్ధరించాలని ప్రభుత్వ అధికారులను మోషే డిమాండ్ చేశారు.లేదంటే ఆందోళన చేస్తామన్నారు.

టిడిపి ఆందోళన

నెల్లూరు :ఇండియన్ నేషనల్ లీగ్ రాష్ట్ర అధ్యక్షులు సమీ హుస్సేనీని దర్గామిట్ట పోలీసులు మంగళవారం ఉదయం అరెస్టు చేశారు.ముస్లిం మైనార్టీ నాయకులు సమీని పోలీసులు అరెస్టు చేసిన సమాచారం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేతిలో పోలీసులు కీలుబొమ్మల వలే వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఎప్పుడు శాశ్వతం కాదని, అదే పోలీసులు గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఏదైనా ఉంటే పగలు పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టాలన్నారు. టిడిపి నేతలు పోలీసు స్టేషన్ నుంచి వెనుతిరిగి వెళ్లిన వెంటనే సమీహుస్సేనీని పోలీసులు జిజిహెచ్‌కి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పోలీసులు సమీపై పలు సెక్షన్లలో కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు.

చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న నారాయణ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ బి హరిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

నారాయణ వైద్యశాల కార్డియాక్ విభాగం వైద్య బృందం 15 నెలల వయస్సు కలిగి, 5.5 కిలోల బరువు కలిగిన పాపాయికి ఓపెన్ హర్ట్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారని ఆ వైద్యశాల మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నారాయణ వైద్యశాలలోని మెడికల్ సూపరింటిండెంట్ ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. కార్డియాలజిస్టు రాంకుమార్ మాట్లాడుతూ సంగం ప్రాంతానికి చెందిన 15 నెలల వయస్సు కలిగిన పాప తీవ్రమైన అనారోగ్యంతో వైద్య చికిత్సల నిమిత్తం తల్లిదండ్రులు తీసుకొచ్చారన్నారు. పాప పుట్టినప్పటి నుంచి శ్వాస కోశ సంబంధిత సమస్యలు పదే పదే తలెత్తుతుండంతో చెన్నయ్, తిరుపతి, బెంగళూరు వంటి మహానగరాలలో వైద్యశాలలకు తీసుకెళ్లి చికిత్సలు అందజేసినప్పటికీ తాత్కాలిక ఉపసమనం తప్ప పూర్తిగా కోలుకోలేదన్నారు. నారాయణ హాస్పిటల్‌కు తీసుకొచ్చి పీడియాట్రిక్ విభాగంలో వైద్యులకు చూపించారన్నారు. ఆ పాపకు పీడియాట్రిక్ వైద్యులు పరీక్షలు జరిపి, గుండెకు సంబంధిత సమస్య ఉన్నట్లు గుర్తించి కార్డియాలజిస్టు డాక్టర్ రాంకుమార్‌కు చూపించాలని తల్లిదండ్రులకు సూచించారన్నారు. పాపకు ఎకో స్కాన్ పరీక్షలు చేసి గుండెలో కండరం పెరిగిందని, గుండెలోని పంపింగ్ గదుల మధ్య రంధ్రం ఉన్నట్లు గుర్తించారన్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశారు. అనంతరం నారాయణ వైద్యశాల కార్డియోథెరాసిక్ సర్జన్ డాక్టర్ టి.ఆర్ ద్వారకానాథ్ మాట్లాడుతూ కార్డియాక్ అనస్థషియా విభాగం వైద్యులు హరీష్ బృందం సహకారంతో హాస్పిటల్లోని అత్యాధునిక సదుపాయాలతో ఫాస్ట్ ట్రాక్ సర్జరీ విజయవంతంగా నిర్వహిం చామన్నారు.గుండె సంబంధిత సమస్యలు, అత్యవసర సలహా సంప్రదింపుల కోసం 733 1170065 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. నారాయణ హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. హరీష్ , నారాయణ హాస్పిటల్ ఏ.జి.ఎం ఎ.సి శేఖర్ రెడ్డి ఉన్నారు.

చిరు వ్యాపారులకు చేయూత

ప్రజాశక్తి-నెల్లూరు :వీధి వ్యాపారులు, చిరు వర్తకుల కుటుంబాలకు ఆర్థిక సంక్షేమం కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పి.ఎమ్ స్వనిధి పథకం ఎంతగానో చేయూతను అందిస్తుందని కమిషనర్ వికాస్ మర్మత్ ప్రకటించారు. మెప్మా విభాగం ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఎపిజె అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో లబ్ధిదారులకు అవగాహన సదస్సును మంగళ వారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ చిరు వ్యాపారుల ఆర్థిక ప్రగతికోసం రూపొందించిన ఈ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని, బకాయి మొత్తాలను సకాలంలో తిరిగి చెల్లించి మరింత మొత్తంలో రుణాలు పొందేందుకు అర్హతలు సాధించాలని సూచించారు. మెప్మా పి.డి రవీంద్ర, ఎల్.డి.ఎమ్ ప్రదీప్ కుమార్, సి.ఎమ్.ఎమ్ పెంచలయ్య, జరీనా, ఎల్.హెచ్ సుధాకర్, వివిధ బ్యాంక్ మేనేజర్లు, పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై దృష్టి

నెల్లూరు :నగర పాలక సంస్థ పరిధిలో జనాభాకు తగ్గట్టుగా అర్హులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఎన్నికల అధికారులకు కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. ఎన్నికల అధికారులు, సూపర్ వైజర్లతో కార్యాలయంలోని ఎపిజె అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో ఓటర్ల జాబితా రూపొందించడంలో బి.ఎల్.ఓ లు తమకు కేటాయించిన పరిధిలోని ఇండ్లను డోర్ టు డోర్ ఇంటింటి సర్వే ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. ఎఇఆర్‌ఒలు నిర్మలానంద బాబా, దేవీ కుమారి, దశయ్య, శ్రీనివాసులు ఉన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-ఉలవపాడు :గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని చాకిచెర్లలో మంగళవారం జరిగింది. ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొని ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసు కున్నారు. పథకాలు రానివారు వారి వివరాలు తీసుకొని వెంటనే వారికి సంక్షేమ పథకాలు అందించాలని హుకుం జారీ చేశారు. ఆది ఆంధ్ర కాలనీ, శ్రీశ్రీ నగర్ లో పూర్తి చేశారు. తహశీల్దార్ ఆర్ బ్రహ్మయ్య, ఎంపిడిఒ చంచమ్మ, ఎస్ఐ బాలాజీ రెడ్డి ఉన్నారు.

గ్రావెల్ రవాణా అడ్డగింత

-మట్టికి అనుమతులు .. గ్రావెల్ తరలింపు..

-ప్రశ్నించిన రైతులు

ప్రజాశక్తి - లింగసముద్రం : లింగసముద్రం కొత్తచెరువు నుంచి గ్రావెల్‌ను తరలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం చెరువలో ప్రొక్లెయిన్ పెట్టి ట్రాక్టర్లతో గ్రావెల్‌ను తరలిస్తున్న విషయం తెలుసుకున్న రైతులు పెన్నా రమణయ్య.పెన్నా శ్రీను, కళ్లగుంట ప్రసాద్, కళ్లగుంట శివయ్య, మానం కొండలరావు, మరి కొందరు రైతులు చెరువులోకి వెళ్లి గ్రావెల్ రవాణాను నిలిపివేశారు. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేశారు. అనుమతులు మట్టికి తీసుకొని గ్రావెల్‌ను ఎలా తొలుస్తారని నిలదీశారు .రైతు పొలం మెరక తోలు కొనేందుకు అధికారులు అనుమతు ఇవ్వడం జరిగింది. అందుకు గాను సోమవారం ఇరిగేషన్ ఎఈ చెరువు మా ర్కింగ్ ఇచ్చారు. పోలం పేరు చెప్పి వెంచర్‌కు గ్రావెల్ తలిస్తుంన్నారని రైతులు చెప్పారు.గ్రావెల్‌కుఅనుమతులు తీసు కొకుండా ఎట్టి పరిస్థితులోను వెంచర్‌కు గ్రావెల్ రవాణాను అడ్డుకుంటామని తెలిపారు. నాలుగు రోజులు కిందట ఇదే విధంగా గ్రావెల్ రవాణా చేస్తున్న సమ యంలో రైతుల నిలిపివేశారు. అప్పుడు పోలీసులు వచ్చి సమస్య పరిష్కారమైన తర్వాత గ్రావెల్ తోలుకోవాలని సూచించారు. గ్రావెల్ రవాణాను రైతులు అడ్డుకున్న విషయం తెలుసుకన్న పోలీస్‌లు ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ కలిసి కొత్త చెరువులోకి వెళ్లి ప్రొక్లెయిన్,ట్రాక్టర్లను బయటకు పంపించారుఏఈ మాట్లాడుతూ పొలం మెరక కోసం మట్టికి అనుమతిచ్చామని, గ్రావెల్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అనుమతులు లేకుండా గ్రావెల్ రవాణా చేస్తే చర్యలు తప్పవని చెప్పారు.




అడ్డుకుంటున్న రైతులు

ఉద్యోగికి విధులు కేటాయింపు

నెల్లూరు :కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశాల మేరకు కమిషనర్ వికాస్ మర్మత్ స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ 2021-22 కింద విభిన్న ప్రతిభావంతురాలైన ఓ మహిళకు ఉద్యోగ నియామకం చేపట్టారు. అంగవైకల్యం కలిగిన వారికి జీవనభృతిని కల్పించే క్రమంలో 4వ తరగతి ఉద్యోగుల జిల్లా ఎంపిక కమిటీ వెనుకబడిన కులాల కింద వేళ్ల గాయత్రిని పిహెచ్ వర్కర్‌గా నియమించింది. ఉత్తర్వులను అనుసరించి స్థానిక 3వ డివిజన్‌లో పబ్లిక్ హెల్త్ విభాగంలో వర్కరుగా ఆమెకు విధులు కేటాయించారు.

రోడ్డును కప్పేసిన చిల్లచెట్లు

ప్రజాశక్తి - లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి మొగిలిచర్ల రోడ్డులో ఉన్న ప్రాజెకు గెస్ట్ హౌస్ వద్దకు వెళ్లే రోడ్డు చిల్లచెట్లతో మూసుకపోయింది. దీంతో అక్కడికి వెళ్లాలంటే తాతా హోటల్ మీదగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పాడింది. చిల్లచెట్లు పెరిగి అడవిని తలపిస్తున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కట్ట మీద కాకుండా రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్టులు పెరిగిపోవడంతో ప్రాజెక్టు మీదగా మొగిలిచర్ల, మాలకొండ వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ప్రాజెక్టుకు రెండు వైపులా కట్ట చిల్లచెట్లతో నిడిపోయింది.వీటివల్ల కట్ట ప్రమాదం ఏర్పాడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రాళ్లపాడు ప్రాజెక్టు కట్ట మీద ఉన్న చిల్లచెట్లను, గెస్ట్‌హౌస్ రోడ్డుకు రెండు వైపులా చిల్లచెట్లు తొలగించాలని కోరుతున్నారు.



రోడ్డును కప్పేసిన చిల్లచెట్లు

వైద్యుల కొరతతో ఇబ్బందులు

ప్రజాశక్తి-ఉలవపాడు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న నాలుగు సర్జన్ డాక్టర్ల పోస్టులను భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం ఉలవపాడు సిహెచ్ సి కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యుల కొరత వల్ల ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల నియమకం చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చెంచమ్మ ,డాక్టర్లు కమిటీ సభ్యులు సర్పంచి నాగలక్ష్మి ,కార్యదర్శి బి విజయమ్మ, బ్రహ్మయ్య వెంకట్రామిరెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి

వైసిపి నిరసన ర్యాలీ

రాపూరు :పుంగనూరులో విధులు నిర్వహిస్తున్న పోలీసులపై టిడిపి నాయకులు దాడి చేశారని, దాడిని ఖండిస్తూ వైసిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. రాపూరులో వైసిపి సీనియర్ నేత పాపకన్ను మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పోలీసులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్నారు. ఆ ఘటనకు బాధ్యులైన టిడిపి నాయకులపై చర్యలు తీసుకోవాలన్నారు.

మళ్లీ వైసిపిదే విజయం

తలమంచి సురేంద్ర బాబు

తోటపల్లిగూడూరు : ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే వైసిపికి అఖండ మెజారిటీ వస్తుందని సర్వేలు చెబుతున్నాయని, ఇది ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగే వార్త అని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్ర బాబు తెలిపారు. మంగళవారం అయన ఇక్కడ మాట్లాడారు. నేషనల్ సర్వే ఇండియా టు డే, టైమ్స్ నౌ, స్ట్రాటజీ ఫోల్ సర్వే, ఈ సర్వ అన్నీ సర్వేలలో జగన న్నదే ప్రభంజనం అంటూ స్ప ష్టం చేశాయన్నారు. ఎవరెన్నిక కుట్రలు చేసినా 2024 ఎన్నికల్లో మళ్లీ వైసిపిదే గెలుపు అని, కాకాణి మళ్లీ మంత్రి పదవి చేపడతారని ధీమా సు రేంద్ర బాబు ధీమా వ్యక్తం చేశారు.



వైసిపి అధికార ప్రతి నిధి సురేంద్ర బాబు

సిద్ధవరంలో 'మహిళా శక్తి'

రాపూరు: రాపూర్ మండలంలోని సిద్ధవరం గ్రామపంచాయతీలో సిద్ధవరం గ్రామంలో టిడిపి నాయకులు మహిళ శక్తి కార్యక్రమంలో ప్రచారం నిర్వహించారు. రాపూర్ మండల టిడిపి అధ్యక్షులు దందోలు వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడారు. మహిళ అధ్యక్షురాలు రావ ఐమ్మ గారు, తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షులు కొండ్లపూడి రాఘవ రెడ్డి, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి నువ్వుల శివరామకష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పచ్చి గల రత్నయ్య ఉన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

నెల్లూరు : సహిత విద్యార్థులను అన్ని విధాలా ప్రోత్సహించేలా విద్యాశాఖ చర్యలు చేపట్టడం అభినందనీయమని ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళ వారం స్థానిక ఎసి సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సహిత విద్యార్థుల క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ క్రీడా పోటీలను డిఇఒ గంగాభవానితో కలిసి ఆయన ప్రారంభించడమే కాకుండా పోటీల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగ విద్యార్థులకు మెడల్స్,సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష విభాగం అధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి

మణిపూర్‌లో హింసాకాండను అరికట్టాలి

నెల్లూరు :మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని వ్యతిరేకిస్తూ నగరంలో మంగళవారం క్రైస్తవ సమాజం ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎబిఎం కాంపౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. నెల్లూరు సెంట్ క్యాథడ్రల్ బిషప్ డాక్టర్ ఎం డి ప్రకాశం ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో సర్వ మానవ సౌభ్రాతత్వం ఉందని, కుల మతాలకు వ్యతిరేకంగా అందరూ ఐకమత్యంతో జీవించాలన్నారు. డాక్టర్ డేవిడ్ దయాసాగర్, డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ దాసరి రాజశేఖర్ ,డాక్టర్ ఎలేషా కుమార్, గడ్డం హనుక్ ,రాఘవ, మోసెస్ ఉన్నారు.



క్రైం కార్నర్

సాయిపేటలో అగ్ని ప్రమాదం



దగ్ధమైన జామతోట

ప్రజాశక్తి-కొండాపురం
మండలంలోని సాయి పేట పొలాల్లో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో భారీనష్టం నెలకొంది. వివరాల మేరకు.. లింగ సముద్రం మండలానికి చెందిన కట్టెల వ్యాపారి జెసిబితో హద్దులు తీయించుకునేందుకు ఉప్పుటేరు పక్కనున్న పొలాలలో మిషన్లకు అడ్డంగా ఉందని కంపకు నిప్పు పెట్టాడు. అయితే మంటలు గాలి ఎక్కువగా ఉండడంతో చుట్టుపక్కల వ్యాపించాయి. అదుపు చేసేందుకు అక్కడ నీళు కూడా లేకపోవడంతో అతను అక్కడి నుండి జెసిబి తీసుకొని వెళ్లిపోయాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దాంతో సుమారు 20 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగింది. దీనిలో గంటా శ్రీనివాసులు అనే రైతుకు సంబంధించిన ఐదు ఎకరాల జామతోట, సపోటా చెట్లు కాలిపోయాయి. అలాగే సాదినేని నరసింహారావు అనే రైతుకు సంబంధించిన సుమారు 80 సెంట్లు సవక తోట, బాదుల్లా అనే రైతుకు సంబంధించి రెండు ఎకరాలు జామాయిల్ తోట, ఎర్రబాలెం గ్రామానికి చెందిన బోనుముక్కల తిరుపతి రెడ్డి సంబంధించిన కరెంటు మోటారు 200 మీటర్ల వైరు కాలి బూడిదయ్యాయి. అలాగే ఒంగోలు సూరిబాబుకు సంబంధించిన కరెంటు మోటారు వైర్లు కాలిపోయాయి. ఇవే కాకుండా మరికొందరు రైతులకు సంబంధించిన జామాయిల్ తోటలు ఖాళీ ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల రూపాయలు నష్టం వాటిల్లి ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిప్పు పెట్టి అజాగ్రత్తగా వదిలి వెళ్లిన కోటేశ్వరరావుపై పోలీసులు కేసు నమోదు చేసి నష్టపరిహారం ఇప్పించాలని రైతుల కోరుతున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి-కొండాపురం
కోడిపందేల స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మండలంలోని గర్విసిపెంట పంచాయతీ వెంకటరంగాపురం పొలాలలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో కొండాపురం ఎస్ఐ ఎస్కె ఖాజావలి తమ బృందంతో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8మంది పందెం రాజులను అదుపులోకి తీసుకున్న ఆయన వారి వద్ద నుండి రూ.12,500 నగదును రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపనున్నట్లు తెలియజేశారు.

దాడి కేసులో నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-ఎఎస్‌పేట
మండలంలోని చిరమన గ్రామం సమీపంలోని మామిడి తోపు వద్ద కాపల ఉన్న ఇద్దరిపై జరిగిన దాడి కేసుకు సంబంధించి నక్క ప్రసాద్‌తో పాటు మరో ఐదుగురిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ కు పంపించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. 5వ తేదీన బోయల సూర్యనారాయణ రెడ్డి, హరికృష్ణ లపై గుర్తుకు తెలియని వ్యక్తులు దాడి సంబంధించి ఫిర్యాదు వచ్చిందన్నారు. దానిమీద ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేపట్టి ఆరుగురు నిందితులను అరెస్టు చేయడమైనదని ఆయన తెలిపారు.

జలవనరుల శాఖ డిఇ సరెండర్

ప్రజాశక్తి-ఉదయగిరి
ఉదయగిరి జలవనరుల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయి శంకరనారాయణను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొన్న సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయన ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా చెరువుల్లో మట్టి తవ్వకాలు, కంపచెట్లు నరికేందుకు అనుమతులు ఇవ్వడంతోపాటు గండిపాళెం జలాశయం నుంచి అనధికారికంగా నీటిని విడుదల చేయడం, తదితర విషయాలపై ఉన్నతాకారులు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆత్మకూరు జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లును, ఇన్‌ఛార్జి డిఇగా వ్యవహరిస్తున్నారు.

నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-కావలి
మండలంలోని చెన్నాయపాలెం గ్రామం, మూలంపేటలో ఆగస్టు 6వ తేదీ మధ్యాహ్నం పిల్లనిచ్చిన మామ నంబూరు నాయుడు బాబును కొట్టి, ఆయన మృతికి కారకుడైన ఇండ్ల శ్రీహరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పెట్టినట్లు కావలి డిఎస్‌పి వెంకటరమణ తెలిపారు. మంగళవారం కావలి డి.ఎస్.పి. కార్యాలయంలో రూరల్ సి.ఐ. రాజేష్, ఎస్.ఐ. సుమన్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరారీలో ఉన్న నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేసిన రూరల్ పోలీసులను అభినందించారు. కుటుంబ కలహాల కారణంగా ఈ హత్య జరిగినట్లు డిఎస్‌పి తెలిపారు.



మాట్లాడుతున్న డి.ఎస్.పి. వెంకటరమణ

ఐక్య ఫౌండేషన్ సేవలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఐక్య ఫౌండేషన్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో పేద ప్రజలకు అత్యవసర సమయాలలో రక్తదానం ఏర్పాటు అనేక సేవలను చేస్తూ ఇటీవల కాలంలో అనివార్య కారణాలతో ఆగిన సేవలను ఎప్పటిలాగే మళ్లీ కొనసాగిస్తామని ఐక్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఫౌండేషన్ చైర్మన్ పయ్యావుల రామకృష్ణ చౌదరి, పయ్యావుల మారుతి నాయుడు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రయివేట్ కళాశాల ఆవరణలో మంగళవారం సంస్థ ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐక్య ఫౌండేషన్ చైర్మన్ పయ్యావుల రామకృష్ణ చౌదరి మాట్లాడుతూ అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి సేవ చేయాలనే సంకల్పంతో ఐక్య ఫౌండేషన్‌ను 28 జూన్ 2019వ సంవత్సరంలో ప్రారంభించామన్నారు. అనంతరం ఐక్య ఫౌండేషన్ రాష్ట్ర డైరెక్టర్ పయ్యావుల మారుతి నాయుడు మాట్లాడుతూ భవిష్యత్తులో గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఫౌండేషన్ సేవలు విస్తరణ చేస్తామని అదేవిధంగా త్వరితగతిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహాయ సహకారాలతో రూ.16,45,700 వ్యయంతో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించామని వివరించారు. కార్యక్ర మంలో సురేష్ చౌదరి, అజీమ్, వెంకటేశ్వర్లు, సురేంద్ర, సుల్తాన్, ప్రదీప్, నిజాము ద్దీన్, కృష్ణ, షాహార్, ప్రతాప్, సుభాని, రాము, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి : స్థానిక వెంగళరావు నగర్ నివాసులు కొండూరు వెంకట శ్రీనివాసరావు- ప్రభావతి దంపతుల కుమారులు దినేష్ సాయి, ధీరజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కాలేరుపుడి గిరిజన కాలనీ, తుఫాన్ నగర్‌లోని పేదలకు 100 భోజనం ప్యాకెట్లు, అరటి పండ్లు వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కుసుమర్తి రాజశేఖర్, గంధం ప్రసన్నాంజనేయులు, ఎమ్‌వివిఎ ప్రసాద్ రావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. అలాగే మరో దాత కావలి పట్టణం నివాసులు మట్టా కొండయ్య - జయమ్మల 51వ పెళ్లిరోజు సందర్భంగా కావలి పట్టణం పరిసర ప్రాంతాల్లో ఉన్న బుడంగంజం గిరిజన ప్రాంతాలలోని పేదలకు 120 భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. దాత మట్టా కొండయ్య, వాలి కుమారులు ఎమ్.వి సురేష్, ఎమ్.వి సుబ్రహ్మణ్య గుప్త, కోడళ్ళ వంశీ ప్రియ, వెంకట సుష్మలు, మనవళ్లు ఆర్యన్ శ్రీనివాస్, లాస్యన్ శ్రీనివాస్, ధీరజ్ పవన్ కుమార్, సాయిచరణ్, సంస్థ సభ్యులు బుర్రా రఘు కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో పరిశీలన

ప్రజాశక్తి-సంగం : స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారా లేదా అని ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. 10న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపల్, తదితరులున్నారు.

పాఠశాలలో ఎంఇఓ తనిఖీ

ప్రజాశక్తి-కావలి రూరల్ : మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య (2), డిప్యూటీ డిఈఓ రఘురామయ్య మంగళవారం ముసునూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు తరగతి గదులను, మధ్యాహ్న పిల్లలకు పెడుతున్న జగనన్న గోరుముద్దను అక్కడే జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద ఎంతో స్వయంగా తిన్నారని, భోజనం కూరలు బాగానే ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటినుంచి 'అమృత్' మహోత్సవాలు

ప్రజాశక్తి-ఉదయగిరి : 9వ తేదీ నుంచి17 వరకు మండలంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలను నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం 9న అప్పసముద్రం, గన్నేపల్లి, కృష్ణంపల్లి, సెలిబారు, పుల్లాయపల్లి, శకునాలపల్లి 10న ఉదయగిరి 11న గండిపాలెం కొండాయపాలెం, తిరుమలాపురం, వెంగళరావునగర్‌లో 14న అప్పసముద్రం దాసరపల్లి బండగానిపల్లి, జి.అయ్యవారిపల్లి, జి.చెర్లోపల్లి, జి.చెరువుపల్లి ఈ వార్డ్ సభలు జరుగుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఆక్రమణ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక డిమాండ్



మాట్లాడుతున్న ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు

ప్రజాశక్తి-కావలిరూరల్
తుమ్మలపెంట రోడ్డును ఆనుకొని ఉన్న కొండేపి కాలువను రియల్ ఎస్టేట్ అక్రమ వ్యాపారులు ఆక్రమించారని ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొండేపి కాలువ పంటపొలాలను కలుపుతూ తిరిగి పంట పొలాలను కలుపుతూ చిప్పలేరువాగులో కలుస్తుందన్నారు. కావలి పట్టణంలోని రియల్ ఎస్టేట్ అక్రమ వ్యాపారస్తులు ఆక్రమించి లేఅవుట్లు వేశారని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా వేసిన లేఔట్లను పరిశీలించిన బృందం ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినట్లుగా భావించిందన్నారు. రియల్ ఎస్టేట్ అక్రమ వ్యాపారస్తులు ప్రభుత్వ స్థలాలైన పంట కాలువలు, వరద కాలువలు, కుంటలు, పోరంబోకు, అసైన్డ్ భూములను ఆక్రమించి లే అవుట్లు వేస్తున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్రమ రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుండి ముడుపులు తీసుకొని బిచ్చగాడి అనుమతులు ఇచ్చారని తెలిపారు. పంట పొలాలను విచ్చలవిడిగా కన్వర్షన్ చేసి ఇస్తున్నారని, అసలు అధికారులు భూమిలోకి వచ్చి చూసి కన్వర్షన్ చేస్తున్నారా లేక ఆఫీసుల్లో కూర్చొని కన్వర్షన్ చేస్తున్నారా అని అధికారులను ప్రశ్నించారు. కావలి నియోజకవర్గంలో ఉన్న పంట పొలాలను, కుంటలను, అసైన్డ్ భూములను రీసర్వే చేసి కంచె వేయాలని అధికారులను కోరారు. కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి భాగస్వామ్యంతో, అండతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగించారన్నారు. నుడా అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను కూడా ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేవట్లు వేశారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలకు కాపలాదారుడుగా ఉండాల్సిన ఎంఎల్ఎ, ప్రభుత్వ స్థలాలను రక్షించాల్సిన ఎంఎల్ఎ ప్రభుత్వ స్థలాలను భక్షిస్తున్నారన్నారు. కావలికి ఎంఎల్ఎ ఒక శాపంగా అధికారులు మరొక శాపంగా తయారయ్యారన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి వేసిన అక్రమ రియల్ ఎస్టేట్ లేఅవుట్లను తొలగించకపోతే భవిష్యత్తులో ఆందోళన తీవ్రతరం చేయాల్సి ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యక హక్కుల పరిరక్షణ వేదిక బృందంలో కన్వీనర్ కరవది భాస్కర్, జ్యోతి బాబురావు (టిడిపి), చింతాల వెంకట్రావు (కాంగ్రెస్), పసుపులేటి పెంచలయ్య (సిపిఎం), కొప్పర్తి నాగరాజు (సిపిఐ), పొబ్బ సాయివిటల్ (జనసేన) లతో పాటు నాగార్జున, వెంకీ, హఫీజ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందని సచివాలయ సేవలు

ప్రజాశక్తి-మర్రిపాడు
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు మెరుగైన సేవలు అందించాలానే లక్ష్యంతో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. అందుకు భిన్నంగా నందవరం గ్రామ సచివాలయంలో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ పనులు నిమిత్తం అక్కడికి వెళ్లిన వారికి నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ బెదిరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతవారం కంది దిలీప్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి ఆధార్ అప్‌డేట్ చేయాలని ఫారం ఇచ్చి తర్వాత రోజు పోయి అడుగ్గా రేపు రా.. అంటూ వారం రోజులు నుండి సచివాలయం చుట్టూ తిప్పుకుంటున్నాడని ప్రశ్నిస్తే పోలీస్ స్టేషన్లో కేసు పెడతానని వచ్చిన ప్రజలను బెదిరిస్తున్నారని వాపోతున్నారు. గత వారం రోజుల క్రితం కంది దిలీప్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి తన ఆధార్ అప్‌డేట్ కోసం సచివాలయం వెళ్లగా పేపర్ నలిగిందని, అక్షరాలు సరిగా కనిపించడం లేదని, మీ పని చేయాల్సిన అవసరం లేదు, నీ పని మాకు అంత ముఖ్యమేమి కాదులే అంటున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ఆధార్ అపడేట్ పని మీద ఓ పెద్దాయన వారాల తరబడి సచివాలయం చుట్టూ తిరుగుతున్నా సమాధానం చెప్పేవారు లేరని వాపోయారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు సమాధానం చెప్పి పనులు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సచివాలయ పరిధిలోని ప్రజలు కోరారు.

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని అన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో టీచర్స్‌ను కలిసి యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు నిర్వహించారు. మండలంలో దాదాపు 190 మంది తమ సంఘ సభ్యత్వం తీసుకున్నారని తెలియ జేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మాజీ అధ్యక్షులు ఎం.మస్తానయ్య, మండల శాఖ అధ్యక్షులు ఆర్.శీనయ్య, ప్రధాన కార్యదర్శి టి.విశ్వనాథ్, మధు, ప్రసాద్ రాజు, శేఖరయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సేవలు సంతృప్తికరం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
ఆత్మకూరు పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పరిశీలించి, అక్కడ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య అన్నారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా పట్టణంలోని శ్రీ షిరిడి సాయిరాం కాలేజీ, సుందర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రంలో 1-2 సంవత్సరాల పిల్లలకు1/2 మాతర ఆల్బెండజోల్ పొడిచేసి పాలలో కలిపి తాగించాలన్నారు. 2-5 సంవత్సరాల పిల్లలకు1 టాబ్లెట్ నెమలించి అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రమోద్, అర్బన్‌ప్రైమరీ హెల్త్‌క్లినిక్ డాక్టర్ అస్మా, సిహెచ్ రామకృష్ణ, ఎన్‌పిహెచ్‌ఎస్, సుందర్‌నగర్ అంగన్‌వాడీ టీచర్ రాధమ్మ తదితరులున్నారు.

'మహా పడావ్‌ను' జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కావలి రూరల్ : కార్మిక, కర్షక వ్యతిరేఖ విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా 9న దేశ వ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన మహా పడావును జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నాలుగు కోడ్స్ రూపంలో కేంద్ర ప్రభుత్వం చట్టాలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. మున్సిపాలిటి లోని డైలీ వేజ్ కార్మికులకు 4 నెలల జీతాలు ఇవ్వలేదని, వెంటనే ఇవ్వాలని లేని పక్షంలో బుధవారం నుండి సమ్మె చేపడుతామని హెచ్చరించారు. కార్మికులు పర్మినెంట్ చేయాలని, డైలీ వేజ్ కార్మికులను అప్కాస్ లోకి తీసుకోవాలని, పర్మినెంట్ కార్మికులకు డిఎ కలపాలని, పట్టణ పరిధి పెరిగినది కాబట్టి కొత్తగా కార్మికులను తీసుకోవాలని డిమాండ్ చేశారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి కె.నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లి అంకయ్య, జిల్లా కార్యదర్శి గుంజి కిషోర్, పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పురపాలక సంఘం డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ పబ్లికేషన్ సంబంధించిన మాస్టర్ ప్లాన్ విషయం మన పాలక వర్గానికి సంబంధం లేకుండా పోవడం సరైనదేనా అని ఎపి రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎల్‌కె కృష్ణప్రసాద్, కృష్ణమోహన్ తెలిపారు. ప్రిలిమినరీ గజిట్ నోటిఫికేషన్ పత్రికలకు ఇవ్వకుండా మున్సిపల్ కమిషనర్ అభ్యంతరాలను ఫ్లెక్సీలు ద్వారా తెలియజేయడం సరైన నిర్ణయమేనా అని ప్రశ్నించారు. ప్రజలందరూ స్పందించి అభిప్రాయాలను వ్యక్తం చేయడం మంచిదని సందర్భంగా వారు తెలియజేశారు.

అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-కావలి : పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, మట్టి పరీక్షలపై జిల్లాలోని వ్యవసాయ అధికారులకు వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణ కార్యక్రమంలో మంగళవారం కావలి ఎడిఎ సిహెచ్.నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. అగ్రికల్చర్ ల్యాబ్ ఎఒ.ఎస్. ప్రసాదరావు ఏవోలతో, ఏఈఓలతో కలిసి, శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి ఎఒ జయరాజు, కందుకూరు ఎఒ గీతా ప్రకాష్, కోవూరు ఎఒ మేరీ కమల, ఆత్మకూరు ఎఒ యానాదమ్మ, పొదలకూరు ఎఒ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న కాకు వెంకటయ్య

ప్రజాశక్తి-ఉదయగిరి
మణిపూర్లో జరుగుతున్న విధ్వంసకాండను నిరసిస్తూ బుధవారం ఉదయగిరిలో సమైక్య క్రైస్తవ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సంఘీభావ శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని జెఎసి నాయకుడు కాకు వెంకటయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శాంతి ర్యాలీ నిర్వహణపై జెఎసి కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు మూడు నెలలుగా మణిపూర్లో జరుగుతున్న క్రూరమైన సంఘటనలు బాధాకరమన్నారు. క్రైస్తవులపై దాడులు చేసినా, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. సుప్రీంకోర్టు ప్రత్యేకంగా జోక్యం చేసుకొని మణిపూర్లో శాంతికోసం చర్యలు చేపట్టాలన్నారు. ఈ సంఘీభావ శాంతి ర్యాలీలో అధిక సంఖ్యలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు దస్తగిరి అహ్మద్, రియాజ్, ఎస్దాని, పంషీర్, అబ్రహం, ఆరోన్ నాయబ్, కోడె రమణయ్య పాల్గొన్నారు.

'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-సంగం
మండలంలోని జెండాదిబ్బ సచివాలయం పరిధిలోని జెండాదిబ్బ, అరవపాళెంలలో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రతి గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందచేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి సరదాగా మాట్లాడి బాగా చదువు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి దేశంలో ఎక్కడా చేయలేని విధంగా 11రకాల ధృవీకరణ పత్రాలు దాదాపు కోటి సర్టిఫికెట్లు ప్రజలకు అందజేశారని, దాంతో ఆ ప్రజల సమస్యలు కూడా పరిష్కారం అయ్యాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెవెన్యూ వ్యవస్థలో తీసుకున్న విప్లవాత్మక మార్పుల కారణంగా చుక్కల భూములు, అసైన్డ్‌మెంట్, డికెటి పట్టాల విషయంలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, దాదాపు 70శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రావుల లక్ష్మీ, వైసిపి మండల కన్వీనర్ శంకర్ రెడ్డి, సర్పంచ్ పద్మావతమ్మ, వైసిపి నాయకులు రఘునాథ్ రెడ్డి, శంకరయ్య, ఎంపిటిసి సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ నరేష్, కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

10న నులిపురుగుల నివారణ దినోత్సవం




మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ పెంచలయ్య

ప్రజాశక్తి-ఎఎస్‌పేట
10వ తేదీన జరగనున్న నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిరమణ ఎఎస్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పిహెచ్‌సిలో బిపి, సుగర్ పరీక్షలు చేయించుకొని సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు. రోగులకు సక్రమంగా వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి విధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పదో తేదీన జరిగే నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు 5 లక్షల 63 వేల మంది ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ జిల్లాలోని అన్ని కాలేజీలు పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలలో 10వ తేదీ మధ్యాహ్నం ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తామని తెలిపారు. ప్రతి కేంద్రంలో ఆరోగ్యసిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎపిడిమిక్ అధికారి డాక్టర్ ప్రమోద్, డిపిహెచ్ ఎన్ లు మంజుల, సునీత, ఎఎస్‌పేట డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ సంధ్యా రాణి, సిహెచ్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి నివాళులు

ప్రజాశక్తి-కావలి
ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో డాక్టర్ గుండెమడుగుల దేవదానం మెమోరియల్ హాస్పిటల్‌లో ప్రముఖ వాగ్గేయ కారుడు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ నాయుడు మాట్లాడుతూ గద్దర్ మరణం దేశానికి తీరని లోటు అని అన్నారు. గద్దర్ త్యాగనిరతి సేవాతత్వం ఈనాటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజల బాధలను జానపద పాటలుగా మార్చి ప్రజలను చైతన్య పరిచే వాడని అన్నారు. గద్దర్ పోరాట స్ఫూర్తిని, త్యాగపూరిత జీవితాన్ని, ప్రజలపై ఉన్న అంకితభావాన్ని బలంగా ముందుకు తీసుకుపోవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థల గౌరవాధ్యక్షులు ఖాదర్ బాషా, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, మాజీ కౌన్సిలర్ మస్తాన్, మాజీ విద్యార్థి నాయకుడు కరవది భాస్కర్, రాజ్‌న్యూస్ జిల్లా స్టాఫర్ చరిత్ కుమార్, స్వచ్ఛంద సంస్థల నాయకురాలు ఎస్‌కె ఖాదర్‌బీ, హాస్పిటల్ పిఆర్‌ఒ ఆనంద్, పాత్రికేయులు చిలకపాటి మధుబాబు, చిలకపాటి మనోహర్, బత్తిన మనోహర్, కందవరపు సురేష్, భీమవరపు బాలాజీ, సిపిఎం రమేష్ తదితరులున్నారు.



చిత్రపటాల ప్రదర్శనలో ఆవాజ్ నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
నెల్లూరు పట్టణంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్ర ప్రాంగణంలో ప్రముఖ చరిత్రకారుల సయ్యద్ నశీర్ అహ్మద్ సౌజన్యంతో భారత స్వాతంత్రోద్యమ సమరయోధుల చిత్రపటాలు ప్రదర్శన జరుగుతున్న నేపథ్యంలో ఆత్మకూరు పట్టణానికి చెందిన ఆవాజ్ నాయకులు తరలి వెళ్లారు. ఆవాజ్ ఆత్మకూరు మండల కార్యదర్శి పి.యస్దానిబాషా, కార్యక్రమ నిర్వాహకులు, సయ్యద్.నసీర్ అహ్మద్, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రషీద్, అధ్యక్షులు ఎస్.కె రఫీ అహ్మద్, ఎగ్జిబిషన్ తిలకించడానికి వచ్చారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-కావలి రూరల్ : గౌరవరం టోల్‌ప్లాజా వద్ద మంగళవారం రూరల్ సిఐ రాజేష్, ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై వాహన దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయం లో తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకుండా వారి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. 35 హెల్మెట్లను వాహనదారులకు పంచారు.

కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి-ఉదయగిరి : ఆనకట్టపై పెరిగిన కంపచెట్లను మంగళవారం హిటాచీతో తొలగింస్తున్నట్లు కాంట్రాక్టర్ అక్కి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ కొలను పథకంలో భాగంగా ఉదయగిరి ఆనకట్ట అభివృద్ధికి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో గత కొన్ని నెలలుగా పనులు నిలిచిపోయాయన్నారు. ఇటీవల కొంత బిల్లులు మంజూరు చేయడంతో జలవనరుల శాఖ అధికారుల సూచనల మేరకు కట్టపై పెరిగిన కంపచెట్లను కాలగించడంతో పాటు కోతకు గురైన ప్రాంతాలను పూడ్చివేశారని తెలిపారు. రానున్న వర్షాల దృష్ట్యా చుట్టూ రివిట్‌మెంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సెప్టెంబర్ 9న 'యానాదుల రాజకీయ భేరి'



ప్రజాశక్తి-కావలి
యానాదులకు ఎంఎల్‌సి, ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ యానాదుల పొలిటికల్ ఫోరం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9వ తేదీన గుంటూరులోని కాసు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో లక్ష మంది యానాదులతో "యానాదుల రాజకీయ భేరి" నిర్వహిస్తున్నామని యానాదుల పొలిటికల్ ఫోరమ్ కన్వీనర్ కె.సి.పెంచలయ్య తెలిపారు. ఇందుకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను మంగళవారం కావలిలోని "జర్నలిస్టు క్లబ్లో" యానాదుల పొలిటికల్ ఫోరం నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెసి.పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 10 లక్షల జనాభా కలిగిన యానాదులకు ఎంఎల్‌సి ఇవ్వాలని కోరుతున్నామ న్నారు. యానాదులను గుర్తించిన వారికే యానాదుల ఓటు వేస్తామన్నారు. గుంటూరు సభలో రాజకీయ నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు యానాదులను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుని మోసం చేస్తున్నాయని విమర్శించారు. యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్, ఎంఎల్‌సి ఇస్తామని జగన్ మోసం చేశారన్నారు. యానాదులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సతీష్‌చంద్ర, రాపూరు కృష్ణయ్య, చెంబేటి ఉష, రాపూరు రాధమ్మ, చలంచర్ల కలుగొలమ్మ, మానికల మురళీ, అద్దూరు శీనయ్య, చలంచర్ల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

తిమ్మారెడ్డిపల్లి పాఠశాలకు గుర్తింపు

ప్రజాశక్తి-వరికుంటపాడు
మండలంలోని తిమ్మారెడ్డిపల్లి పాఠశాలకు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు లభించింది. మంగళవారం నెల్లూరులో జరిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సంబంధించిన క్రీడా పోటీలో తమ క్రీడా సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. బాయ్స్ విభాగంలో 100 మీటర్ల పరుగుకు సంబంధించి రాగి మనోజ్ జిల్లాలో ద్వితీయ స్థానం దక్కింది. అలాగే బోస్ అనే క్రీడలో అత్యంత ప్రతిభ కనబరిచిన షేక్.అప్సర, షేక్ సనాసాహి, ఎస్. మానస ప్రత్యేక గుర్తింపు పొంది పతకాలను సొంతం చేసుకున్నారు. తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులైన వీరు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించడంపై జిల్లాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయుడు మనోహర్ అభినందించారు.

ఓటర్‌జాబితా సర్వేపై ఆర్ఒ సమీక్ష

ప్రజాశక్తి-ఉదయగిరి : తహశీల్దారు కార్యాలయంలో మంగళవారం ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటా ఓటర్ల జాబితా సర్వేపై నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సువర్ణమ్మ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె నియోజకవర్గంలో సర్వే ఎలా జరుగుతుంది.. ఇప్పటివరకు ఎంతమంది ఓట్లను సర్వే చేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియ తదితర విషయాలను అడిగి తెలుసుకొన్నారు. సర్వే త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సర్వే రిపోర్టులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దారు జగదీష్ బాబు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ లలితమ్మ, తదితరులున్నారు.

సేవా కార్యక్రమంలో మెప్మా సిబ్బంది

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో కంచి పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత అన్నదాన కార్యక్రమంలో ంగళవారం ఆత్మకూరు పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెప్మా సిఇఒ మాధవి మాట్లాడుతూ ఉచిత అన్నదానం గురించి అందరూ చెబుతుంటే మన ఊరిలో ఇంత మంచి కార్యక్రమాన్ని చూసి వద్దామని ఇక్కడికి వచ్చామన్నారు.

సీఫుడ్ ఫెస్టివల్ పోస్టర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉదయగిరి
నెల్లూరులో 11, 12, 13 తేదీల్లో జరిగే సీఫుడ్ ఫెస్టివల్ విజయ వంతానికి ఎంపిడిఒ మల్లికార్జునతో సీఫుడ్ వి.ఎఫ్.ఎ.లు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్వా రైతులు మత్స్యకారులు ఉత్పత్తి చేస్తున్న చేపలు, రొయ్యలకు సరైన మద్దతు ధర కల్పించడానికి మత్స్యశాఖ, భూమి ఆర్గానిక్స్ వారు సంయుక్తంగా ఫిష్ ఆంధ్ర ఆధ్వర్యంలో 3వ సీ ఫుడ్ ఫెస్టివల్‌ను నెల్లూరులోని శాంతినగర్ కస్తూరి దేవి గార్డెన్స్ కెవిఆర్ పెట్రోల్ బంకు వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులు 40 మంది వంట వాళ్లతో వివిధ రకాలైన చేపలు, రొయ్యలు, పీతల వంటకాలు తయారు చేసి వినియోగదారులకు సరసమైన ధరలకు అందించబడునన్నారు. ఈ ఫెస్టివల్‌లో భాగంగా బాలికలు, యువతులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్ రేణుక, సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు గోపి, సమద్, మాజీ సర్పంచ్ ఓబుల్ రెడ్డి, కార్యదర్శి నాగూర్‌బీ, విఎఫ్ ఎ మస్తాన్, మహేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని బ్రాహ్మణపల్లిలో మేకపాటి నివాసంలో ఆగస్టు 11, 12,13 తేదీలలో జిల్లాలోని శ్రీ కస్తూరి దేవి గార్డెన్స్‌లో జరిగే సీఫుడ్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మంగళవారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తుల డొమెస్టిక్ మార్కెటింగ్‌ను ప్రోత్సహించ డానికి మత్స్యశాఖ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో సీ ఫుడ్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తుందన్నారు. స్థానిక సంస్కృతి, వంటకాలను, మత్స్యకారులను ప్రోత్సహించేందుకు అందరూ తరలిరావాలని మత్స్య శాఖ అభివృద్ధి అధికారి టి.శ్రీనివాసులు, సాగర్ మిత్ర రేష్మ పర్వీన్ కోరారు.

